క్లుప్తంగా

చిన్నారులకు ఆర్థిక సాయం



మారెళ్లలో చిన్నారులకు చెక్కు అందజేస్తున్న యమ్మే రాజశేఖరరెడ్డి

తుగ్గలి : తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మిగిలిన చిన్నారులను ఆదుకునేందుకు మానవతావాదులు స్పందిస్తున్నారు. మారెళ్లకు చెందిన ఆంజినేయులు, లక్ష్మి మృతితో వారి కుమార్తెలు జయశ్రీ, అంకిత, ఉష్తశ్రీ అనాథలయ్యారు. ఇప్పటికే వీరిని ఆదుకునేందుకు పలువురు దాతలు ముందుకొచ్చారు. మంగళవారం గ్రామానికి చెందిన యమ్మే శ్రీనివాస రెడ్డి రూ.20వేల చెక్కును ఆయన తండ్రి రాజశేఖరరెడ్డి ద్వారా చిన్నారులకు అందించారు.

విద్యా రంగ సమస్యలపై పోరాటం



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించిన దృశ్యం

ఆస్పరి: విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. మండల మహాసభ సదర్భంగా సంఘం జెండాను ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగన్న ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, ఏఐఎస్ఎఫ్ నాయకులు కృష్ణమూర్తి, ఈశ్వర్, రమేష్, రాజు, అనిల్, వీరాంజినేయులు, భరత్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. మారెమ్మ



మారెమ్మ అమ్మవారు

కృష్ణగిరి: మండలంలోని అమ్మవార్ల దేవాలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్లూరు గ్రామంలోని మారెమ్మ , ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు బొనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మా పిల్లపాపలను చల్లంగా చూడమ్మా అని వేడుకున్నారు. ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు భక్తులు సౌకర్యాలు కల్పించారు.

నేడు కప్పట్రాళ్లకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రాక

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పర్యటిస్తారని సీపీఐ మండల కార్యదర్శి నరసారావు మంగళవారం తెలిపారు. ఫారెస్ట్ భూముల్లో యురేనియం తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తారన్నారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న వైద్యుడు

హాలహర్వి: ఆశా వర్కలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మెరుగైన సేవలు అందించాలని డాక్టర్‌లు గంగాధర్, ఈరన్న, మన్సూర్‌వలి తెలిపారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో ఆశావర్కర్లతో నిర్వహించిన సమావేశంలో డాక్టర్లు మాట్లాడారు. గర్భిణులకు పౌష్టికాహారం, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఎలా ఉండాలి తదితర విషయాలను విశదీకరించారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించేలా చైతన్య పరచాలని ఆశా వర్కర్లకు సూచించారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

వెల్దుర్తి(కృష్ణగిరి): రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ తెలిపారు. మండల పరిధిలోని సర్పరాజపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో ఎక్కడైనా పొరపాట్లు జరిగినట్లు భావించినా, తాము నష్టపోయాం అనుకున్న భూ యజమానులు, రైతులు గ్రామ సభలో ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పల్లెజీవి సుగ్గిబాట



గుడెసె ముందు దిగాలు కూర్చున్న వృద్ధురాలు పేరు ఈరమ్మ. ఈమెకు ఐదుగురు కుమారులుండగా ముగ్గురు వలస వెళ్లారు. ఈమె హాలిగేరలోని చిన్న కుమారుడి ఇంటి వద్ద ఉంది. పనులు లేకపోవడంతో ప్రతి సంవత్సరం తెలంగాణలో పత్తి కోతలకు చిన్న కుమారుడి కుటుంబం వెళ్తుందని, వారు వచ్చే వరకు ఇంటి దగ్గరే ఉంటున్నానని చెబుతోంది. దాదాపుగా ప్రతి ఇంటి దగ్గర వృద్ధులు కన్పిస్తున్నారు. వలస వెళ్లిన కుటుంబీకులు వచ్చే వరకు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిందే.

వలసలు.. జిల్లా పశ్చిమ ప్రాంతంలో ప్రతి పల్లెలో ఏటా కనిపించే దృశ్యాలే. స్థానికంగా పనులు లేకపోవడంతో వలసలు మొదలయ్యాయి. ఊరూరా వలస బండి కదులుతోంది. మూటముల్లే సర్దుకొని.. వెళ్లొస్తామంటూ భారమైన హృదయంతో ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్నారు. విద్యార్థుల చదువులు ఆగిపోతున్నాయి. ఊళ్లకు ఊళ్లు ఖాళీ అవుతున్నాయి.

- ఖాళీ అవుతున్న ఊళ్లు
- బడి మానేసి తల్లిదండ్రులతో వెళ్తున్న విద్యార్థులు
- సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయని ప్రభుత్వం



హాలిగేరలో వలస వెళ్లడంతో ఇళ్లకు తాళాలు పడిన దృశ్యం



మూటాముల్లె సర్దుకుని వలస వెళుతున్న ముక్కెల్ల కూలీలు

ఆస్పరి/తుగ్గలి: వలసలతో పల్లెలు ఖాళీ అవుతున్నాయి. పనులు లేక వ్యవసాయ కూలీలు బతుకు తెరువు కోసం వలస బాట పట్టారు. ఆస్పరి మండలంలో ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హాలిగేర, చిగిళి, నగరూరు, తంగడరోణ, జొహరాపురం, చిన్న హోతూరు, బిల్లేకల్లు, ముత్తుకూరు, పుటకలమర్రి, కైరుప్పల, కారుమంచి, ములుగుందం, డీకోటకొండ, బైలుపత్తికొండ, గార్లపెంట, బనవనూరు, పలకూర బండ గ్రామాల నుంచి సుమారు మూడు వేల మంది కూలీలు తెలంగాణలోని పత్తి పొలాల్లో పని చేడానికి వలస వెళ్లారు. తుగ్గలి మండలంలో కోతికొండ, ఎద్దులొడ్డి, రామకొండ, మారెళ్ల, గిరిగెట్ల, ముక్కెల్ల, మద్దికెర మండలం బసినేపల్లి, హంప, యడవలి, కృష్ణగిరి మండలం ఎరుకలచెర్వు, జీ.మల్లాపురం, పోతుగల్లు, చిట్యాల, చందోలి, చక్రాల్లలో పలు కుటుంబాలు రాజంపేట, గుంటూరుతో పాటు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు వలస వెళ్లగా మున్ముందు వలసలు అధికమయ్యే అవకాశం ఉంది. రబీలో పప్పుశనగ విత్తనం పూర్తైనందున పనులు దొరకడం లేదని కూలీలు పేర్కొంటున్నారు.

గిట్టుబాటు కాని ఉపాధికూలి

ఆస్పరి మండలంలో 13,713వేల జాబ్ కార్డులుండగా 11వేల మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 800 మంది కూలీలు మాత్రమే పనులకు వస్తున్నారు. తుగ్గలి మండలంలో 17,817 జాబ్ కార్డులుండగా 32,675 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలను ఆదుకోలేకపోతోంది. ఒక్కో జాబ్‌కార్డుకు వంద రోజులే పని కల్పించడంతో పని దినాలు త్వరగా ముగుస్తున్నాయి. పనులకు వెళ్లిన పనికి తగ్గట్లు వేతనం లభించడం లేదని కూలీలు వాపోతున్నారు. వచ్చిన కూలితో ఇల్లు గడవటం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వలస బాట పడుతున్న విద్యార్థులు

ఆస్పరి మండలంలో 33 గ్రామాలు ఉన్నాయి. మండలానికి సాగునీటి వనరులు లేకపోవడంతో వర్షాధారం పైనే పంటలు సాగుచేస్తున్నారు. పంటలు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో ఖరీఫ్ సీజన్ అయిపోగానే రైతులు కూడా వలస బాట పడుతన్నారు. తల్లిదండ్రులతో పాటు బడి మానేసి విద్యార్థులు కూడా వలస వెళ్లుతున్నారు. మండలంలోని 65 పాఠశాలల్లో 11,800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 2వేల మందికి పైగా విద్యార్థులు తల్లి దండ్రులతో కలసి వలస వెళ్లారు. ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా 133 మంది విద్యార్థులు ఉండగా ఇందులో 50 మంది వలస వెళ్లారని ప్రిన్సిపాల్ లక్ష్మీనరసంహ తెలిపారు. అలాగే హాలిగేర జిల్లా పరిషత్ హైస్కూల్లో 310 మంది విద్యార్థులు ఉండగా 100 మంది హాజరు కావడంలేదు. ప్రభుత్వం సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయకపోవడంతో తప్పని పరిస్థితుల్లో తల్లిదండ్రులు పిల్లలను వెంట తీసుకెళ్లుతున్నారు.

వలసలు వెళ్లొద్దు పని కల్పిస్తాం

కూలీలు ఎవరూ వలసలు వెళ్లొద్దని ఉపాధి సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పలుమార్లు సమావేశాలు నిర్వహించి వలసల నివారణకు పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం. కూలీలు అడిగిన వెంటనే ఆ గ్రామాల్లో పని కల్పించేసేందుకు సిద్ధంగా ఉన్నాం. పండ్ల తోటలు, గృహ నిర్మాణాల్లో కొందరు కూలీలు పని చేసుకుంటున్నారు. వారందరికీ ఉపాధి పథకం కింద వేతనాలు చెల్లిస్తున్నాం. కొత్త పనులు కూడా ప్రారంభించనున్నాం.

– పక్కీరప్ప, ఏపీడీ

పనులు దొరక్క వలస వెళ్తున్నాం



మాగ్రామంలో ఎర్ర నెలల పొలాలు ఎక్కువ. మూడు నెలలు పాటు కూలీ పనులు దొరుకుతాయి. ఆ తరువాత తెలంగాణలో పత్తి కోతలకు వెళ్లాల్సిందే. నేను నాభర్త తెలంగాణకు పనులకు కోసం వలస వెళ్తున్నాం. మా గ్రామం నుంచి ఒకే రోజే 12 టిప్పర్లలో తెలంగాణ ప్రాంతానికి వలస వెళ్లారు.

– మాధవి హాలిగేర గ్రామం. ఆస్పరి మండలం

సుగ్గి తప్పదు



ఉన్న రెండుకెరాలలో కంది, సజ్జ పంట వేశా. సజ్జ దిగుబడి కూడా అంతంత మాత్రంగా వచ్చింది. కందిలో ఇప్పుడు పనేమీలేదు. దీంతో గుంటూరుకు పత్తి తీసేందుకు పోతున్నాం. ఉపాధి పనులు ఎప్పుడు పెడతారో తెలియదు. కూలీ డబ్బులు కూడా ఎందుకూ సరిపోవు. సుగ్గికి పోతే అక్కడ రోజూ పని ఉంటుంది. వచ్చే డబ్బుతో ఇంత అప్పులు కట్టుకుంటాం.

– శ్రీహరి, కోతికొండ

సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి



ఆస్పరి మండలంలో విద్యార్థులు తల్లి దండ్రులతో కలిపి వలస వెళ్తుండడంతో పాఠశాలల్లో హాజరు శాతం తగ్గింది. ప్రభుత్వం సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు చేస్తే విద్యార్థులను హాస్టళ్లలో విడిచి తల్లి దండ్రులు వలసలు వెళ్తారు. బిణిగేరి ప్రాథమిక పాఠశాలలో 95 మంది విద్యార్థులుండగా ఇందులో 30 మంది విద్యార్థులు వలస వెళ్లారు.

– నాగేంద్రప్ప, ఎస్టీయూ జిల్లా అషోషియేట్ ప్రసిడెంట్

కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఆస్పరిలో డాక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు



తుగ్గలిలో వైద్యాధికారి ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు



డాక్టర్ న్యూటన్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న ఆశా వర్కర్లు

ఆస్పరి: కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ, ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు, నాయకురాళ్లు హనుమంతు, రంగస్వామి, లక్ష్మీ, భవనేశ్వరీ మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందడం లేదని, సెలవులు తీసుకోవాలన్నా అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధార పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు ఆపాలన్నారు. కనీస వేతనం నెలకు రూ. 25వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ మాధవీలతకు వారు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకురాళ్లు ప్రభావతి, వసుందర, ఈరమ్మ, లక్ష్మీదేవి, లలిత, గోవిందమ్మ, ఇంద్రమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన

తుగ్గలి : ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తుగ్గలి, పగిడిరాయి పీహెచ్‌సీల వద్ద ఆశా కార్యకర్తలు ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గోపాల్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు, అర్హులైన ఆశా కార్యకర్తలను సెకండ్ ఏఎన్ఎంగా తీసుకోవాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల వైద్యులు ప్రవీణ్‌కుమార్, హరితకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షులు రంగస్వామి, సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు, ఆశా వర్కర్లు శకినాబీ, నాగవేణి, త్రివేణి, రంగమ్మ, లావణ్య పాల్గొన్నారు.

హొళగుంద: ఆశా వర్కర్ల సమస్యలకు సంబంధించి కుదిరిన ఒప్పందం మేరకు జీవోలను వెంటనే విడుదల చెయాలని సీఐటీయూ హొళగుంద మండల కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన హొళగుంద పీహెచ్‌సీలో ఆశా వర్కర్ల యూనియన్ సభ్యులతో కలిసి డాక్టర్ న్యూటన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 9 నెలలు కావస్తున్నా ఇంత వరకు ఒప్పంద జీవోలను విడుదల చెయకపోవడంతో ఆశా వర్కర్లు ఆందోళనకు గురౌతున్నారని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



కురువెల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సీవీ నరసింహులు


ఆలూరు: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆలూరు ఎస్ఐ సీవీ నరసింహులు హెచ్చరించారు. ఆలూరు మండలంలోని కురువెల్లిలో మంగళవారం రాత్రి ఎస్ఐ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఐకమత్యంగా ఉంటూ గ్రామాభివద్ధి చేసుకోవాలని సూచించారు.

రబీ పంటలకు బీమా చెల్లించండి

పంట	యూనిట్ లెవెల్	ఎకరాకు బీమా ప్రీమియం	ఆఖరు తేదీ
పప్పుశనగ	గ్రామస్థాయి యూనిట్..	రూ.420	15-12-24
వరి	మండల యూనిట్	రూ. 630	31-12-24
జొన్న	మండల యూనిట్	రూ.297	15-12-24
వేరుశనగ	మండల యూనిట్	రూ.480	15-12-24
ఉల్లి	జిల్లా యూనిట్	రూ.1,350	15-12-24
టమాట	మండల యూనిట్	రూ.1,500	15-12-24

మద్దికెర : మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసి ప్రభుత్వం గుర్తించిన పంటలకు బీమా ప్రీమియం సొమ్ము చెల్లించాలని ఏఓ రవి మంగళవారం తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పప్పుశనగ, వరి, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలు వస్తామని వాతావరణ బీమా కింద టమోటా పంటలు వస్తాయన్నారు. కావున రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంటలకు సకాలంలో బీమా సొమ్ము చెల్లించాలని సూచించారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

ఆదోని అర్బన్: పీఎం సూర్య ఘర్ సోలార్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించి, ప్రతి ఇంట్లో సోలార్ పెట్టుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక డీఈ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పట్టణం, గ్రామాల్లో సోలార్‌పై రూ.78 వేలు సబ్సిడీ వస్తుందని, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లల్లో పెట్టుకుంటే విద్యుత్ ఆదా కావడమేగాకుండా విద్యుత్‌ను అమ్ముకోవచ్చన్నారు. సమావేశంలో ఎస్ఏఓ రాఘవులు, డీఈ రాజేష్, ఏడీలు పురుషోత్తం, సంతోష్, ఖాజావలి, కర్నూలు కన్‌స్ట్రక్షన్ ఏడీ యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

మద్దికెర : స్థానిక కాలువ వీధిలోని మహేశ్వరి దేవి శిఖర, కలశ, పోతురాజు సమేత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వుంటాయని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. బుధవారం శ్రీమహాగణపతి పూజ, సాయంత్రం పునఃపూజ, లక్ష్మిపూజలతో పాటు హోమాలు, జలధివాసం కార్యక్రమాలు, 7న మహాశాంతి హోమం, గ్రామోత్సవం, 8న శుక్రవారం శిఖర ప్రతిష్ట, పోతురాజు సమేత విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, మహా మంగళహారతి మధ్యాహ్నం అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు ఆలూరు మండల మీట్

ఆలూరు: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో బుధవారం ఆలూరు మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమాదేవి ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ సదుపాయం, ఉపాధి హామీ తదితర పథకాలపై చర్చ ఉంటుందన్నారు. జెడ్పీటీసీ, వైఎస్ ఎంపీపీలు, మండల కో-ఆప్షన్ మెంబర్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): బ్యాంకుల ద్వారా పొదుపు సంఘాల సభ్యులు పొందిన రుణాలు సకాలంలో చెల్లించాలని ఏపీఎం అనురాధ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఆమె గ్రామైక్య సంఘాల అధ్యక్షుడు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. పొదుపు సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మరలా తీసుకునేందుకు వీలుంటుందన్నారు. రుణాలు సకాలంలో చెల్లించిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందుతాయన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదు

ఆలూరు: ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని విమర్శించే స్థాయి దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడికి ఏ మాత్రం లేదని ఆలూరు మండలం శ్రీసాయి సమైక్య దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు జట్టప్పగారి వీరేష్ మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. ఆలూరు నియోజకవర్గం ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ఎమ్మెల్యేకు చదువు రాదని ఇష్టానుసారంగా విమర్శిస్తే చదువుకున్న మూర్ఖుడిగా మాజీ ఎంపీపీ మిగిలిపోతాడన్నారు. ఇప్పటికైనా స్థాయికి మించిన విమర్శలు మానుకోవాలని, లేని పక్షంలో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఎల్లార్తిలో తీరిన నీటి సమస్య

హొళగుంద: ఎల్లార్తి గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు మంగళవారం సర్పంచ్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో గ్రామంలో పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు దర్గప్ప, ఎస్కే గిరి తెలిపారు. గ్రామానికి సమ్మతగేరి వాటర్ స్కీం నుంచి నాలుగైదు కోజులోకోసారి నీటి సరఫరా జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో గ్రామంలో బోరు వేయించి ఆయా వీధులకు తాగునీరు అందేలా పైప్‌లైన్ చేపట్టినట్లు వారు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం : మండల పరిధిలోని మాధవరం సంత మార్కెట్ సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం గిలకసూగూరు క్యాంప్ గ్రామానికి చెందిన నాగేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 288 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు తీసుకెళ్తూ పట్టుబడ్డారన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

చెత్త సంపద కేంద్రాలను పరిశీలించిన డీఎల్‌పీఓ

సాక్షి ఎఫెక్ట్



కుందనగిర్తిలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వీరభద్రప్ప

చిప్పగిరి: చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయని సాక్షి దిన పత్రికలో రెండు రోజుల క్రితం ప్రచురించిన 'చెత్తశుద్ధి కొరవడి' కథనానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు మంగళవారం డీఎల్‌పీఓ వీరభద్రప్ప మండలంలో పర్యటించారు. చెత్త సంపద కేంద్రాలు తనిఖీ చేశారు. కేంద్రాల స్థితిగతులపై ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శలతో ఆరా తీశారు. స్థానిక గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తెచ్చి వర్మి కంపోస్ట్ తయరీకి చర్యలు చేపట్టాలన్నారు. వారంలోపు పురోగతి నివేదిక పంపాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర, నరేంద్ర, నాయక్, ప్రమీల, సుధీర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డాక్టర్ బిందుమాధవికి వినతి పత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

హొళగుంద: 104 ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిస్కరించాలని సిబ్బంది మంగళవారం హొళగుంద పిహెచ్‌సీలో డాక్టర్ బిందుమాధవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు శంభులింగ, మహబూబ్‌బాషా మాట్లాడుతూ తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వలను కుటుంబ పోషణ భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇష్టారాజ్యంగా వైన్‌షాపులు పెట్టనివ్వొద్దు

హొళగుంద: ప్రభుత్వ నిబంధనాలు పాటించకుండా మండల కేంద్రం హొళగుందలో ఇష్టారాజ్యంగా మద్యం షాపులను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి మంజూరైన రెండు వైన్ షాపులను ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఏర్పాటు చేశారని ఆరోపించారు. గుడులు, బడులకు దూరంగా ఉండాలన్న నిబంధనలను పాటించకుండా నిత్యం మహిళలు, భక్తులు, విద్యార్థులు తిరిగే ప్రదేశాల్లో వైన్‌షాపులను పెట్టడడం సమంజసం కాదన్నారు. నివాసగృహాలు, పాఠశాలలు, ఆలయాలకు దూరంగా వైన్‌షాపులు పెట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వాటర్ ప్లాంట్ మరమ్మతు చేయించండి సారూ!



చిప్పగిరి జెడ్పీ హెస్కూల్ పాఠశాలలో మరమ్మతుకు నోచుకోని మినరల్ వాటర్ ప్లాంటు

చిప్పగిరి: స్థానిక జెడ్పీహెచ్ హైస్కూల్‌లో ఐదు నెలలుగా తాగు నీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో మొత్తం 479 మంది విద్యార్థుల వరకు విద్య నభ్యశిస్తున్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థులకు సకల సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలలో శుద్ధమైన తాగు నీటి కోసం మినరల్ వాటర్ ప్లాంటులను అందుబాటులో ఉంచింది. అయితే జెడ్పీహెచ్ హైస్కూల్‌లో మినరల్ వాటర్ ప్లాంటు మరమ్మతుకుగురై నెలలు గడుస్తున్నా అధికారులు చర్యలు తీసుకోక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఇంటి నుండే నీరు తెచ్చుకొని తాగాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు విద్యార్థులు పాఠశాలలోని బోరు నీటినే తాగుతున్నారు. అధికారులు స్పందించి మినరల్ వాటర్ ప్లాంటు మరమ్మతులు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.



మధ్యాహ్నం వచ్చిన వాహనం నుంచి గ్యాస్ సిలిండర్ తీసుకుంటున్న వినియోగదారులు

గ్యాస్ కోసం పడిగాపులు

హొళగుంద: భారత్ గ్యాస్ కోసం వినియోగదారులు మంగళవారం గంటల తరబడి పడిగాపులు కాశారు. ప్రతి మంగళవారం డెలివరీ చేయడానికి ఆదోని నుంచి హొళగుందకు వస్తున్న సదరు గ్యాస్ వాహనం సమయపాలన పాటించకపోవడంతో వినియోగదారులు పనులు మానుకుని గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఎండలో నిరీక్షించిన పలువురు గ్యాస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డోర్ డెలివరీ చేయకుండా ఒక చోట వాహనాన్ని నిలబెట్టి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు ఎలా వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు స్పందించి ఇంటింటికీ గ్యాస్ అందేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.